# పుస్తకమా నీ విలువెంత?

ఈమధ్య 'పుస్తకం హస్తభూషణం' అనే వ్యాసం ఈ ఎన్నారై కబుర్లలో వ్రాశాక, పాఠకులనించీ మంచి స్పందన వచ్చింది. నా అభిప్రాయాలని సమర్థిస్తూ ఎన్నో ఈమైల్స్ వ్రాశారు. పుస్తకాలు చదవటం అలవాటు తప్పిన మన వాళ్ళెవరైనా తిడుతూ వ్రాస్తారేమోననుకున్నాను. కానీ అలాటివేమీ రాలేదు. అప్పుడే అనిపించింది - తెలుగు పుస్తకాలు చదవని అలాటి వాళ్ళు నా వ్యాసం కూడా చదవరు కదా - మరిక వాళ్ళు ఉత్తరాలెలా వ్రాస్తారు అని.

కాకపోతే ఒక ఉత్తరం నాకు బాగా ఆశ్చర్యం కల్పించింది. అది వ్రాసింది ఒక సీరియల్ నవలా రచయిత. దాంట్లో ముఖ్యంగా రెండు విషయాలు. ఒకటి తెలుగు రచయితలలో డబ్బు కాపీనం పెరిగిపోయిందనీ, రెండవది తెలుగు పుస్తకాల ఖరీదు చాల ఎక్కువ అనీ. తర్వాత నేనూ, ఆ రచయితా నాలుగైదు ఉత్తరాలు వ్రాసుకున్నాం. 'ఈనాటి రచయితల పుస్తకాల ఖరీదు చాల ఎక్కువగా వుంటున్నదనీ, అందువల్లనే రచయితలకి డబ్బు కాపీనం ఎక్కువయిందని' వ్రాశానని, ఆయన నాకు వ్రాసిన ఇంకో ఈమైల్లో వ్రాశారు. ఆయన రేకెత్తించిన ఆ రెండు విషయాల గురించీ నా భావాలు చెబుదామని ఈ వ్యాసం వ్రాస్తున్నాను.

మన తెలుగు రచయితలలో డబ్బు కాపీనం పెరిగిపోయిందో లేదో నాకు తెలీదుకానీ, వాళ్ళు -అంటే వెయ్యికి ఒకళ్ళు కూడా- వారి రచనల మీదే ఆధారపడే సంపాదన సంపాదించుకోవటం లేదని నా అభిప్రాయం. అనుభవం. చరిత్ర కూడా అదే చెబుతోంది. మిగతా దేశాల్లోనూ, మన దేశంలో మిగతా ఎన్నో రాష్ట్రాల్లోనూ, ఎంతోమంది రచయితలు వృత్తిరీత్యా రచయితలుగానే వుంటూ జీవిస్తున్నారు. వాళ్ళల్లో కొందరు ధనవంతులయారు. తెలుగులో మహారచయితలయిన భమిడిపాటి కామేశ్వరావుగారు కానీ, ఆరుద్ర కానీ, శ్రీశ్రీ కానీ, ముళ్ళపూడి వెంకటరమణ కానీ, సులోచనారాణి కానీ కోట్లకి పడగలెత్తలేదు.

సినిమాల్లోకి వెడితే ధనవంతులవచ్చు అనే ఒక అపోహ కూడా వుంది. నటీనటులూ, దర్శకులూ అవుతారేమోకానీ రచయితలు మాత్రం అవరు. పగ, ప్రేమ అనే రెండు అంశాల మీద ఏడు వందల సినిమాలకి ఒకే కథని తిప్పితిప్పి తిరగ వ్రాయటమే కాకుండా, కులద్వేషాలూ, బూతు మాటలూ, రక్తపాతాలతో యువ తరాన్ని నిర్వీర్యం చేస్తూ, సినిమాల కథలూ మాటలూ వ్రాసే వాళ్ళ గురించి నాకు తెలీదు. నేను చెప్పేది మహారచయితలు ఎన్నార్ నంది, పాలగుమ్మి పద్మరాజు, మహారథి, ఆత్రేయ, కొసరాజులాటి వారి గురించి వ్రాస్తున్నాను. ఈనాటి రచయితల్లో సిరివెన్నెల, అలాటి ఇద్దరు ముగ్గురూ తప్ప చక్కటి పాటలూ, మాటలూ ఎవరు వ్రాస్తున్నారో (?) నాకు తెలీదు కనుక వారి గురించి వ్రాయటం లేదు.

ఎన్నో పత్రికలు రచయితలకి పారితోషకం ఇవ్వవు. కొన్ని పత్రికలు రచయితలకి, పేరు పొందిన రచయితలైనా సరే, వారి కథలు ప్రచురింపబడిన కాపీలు కనీస మర్యాదగా కూడా పంపించవు. అదీ మన రచయితల రాబడి.

ఈనాటి పుస్తకాల ఖరీదు విషయం మీద కూడా నా ప్రశ్నలు నాకున్నాయి. అనగా అనగా విజయవాడ అనే వూళ్ళో, ఎంతో మంది పబ్లిషర్లు వుండేవాళ్ళు. ఎన్నో మంచి పుస్తకాలు ప్రచురించే వాళ్ళు. అలాగే మద్రాసునించీ కూడాను. ఈరోజుల్లో ఎంతో పేరు పొందిన ప్రచురణ సంస్థలు కూడా, ప్రముఖ రచయితల పుస్తకాలు వేయటానికే వెనకాడుతున్నాయి. కారణం కొనేవాళ్ళు లేక. మనవాళ్ళు బూతు సినిమాలని పదే పదే చూస్తారు కానీ మంచి పుస్తకాలు కొనరు మరి. వెయ్యి కాపీలు వేసినా అమ్ముడు పోవటానికి ఎన్నో సంవత్సరాలు పడుతుంది. ఎవరైనా రచయితలు అప్పో సప్పో చేసి తమ స్వంత ఖర్చుతో పుస్తకాలు వేసుకున్నా, అది తమ ఆత్మానందానికీ పందేరాలకీ తప్ప డబ్బు చేసుకోవటానికి కాదు. ఈరోజుల్లో పుస్తక ప్రచురణ కూడా తలకు మించిన భారమయిపోయింది. కరణీకాలు రద్దు చేయటం, పెంషన్ వయసు తగ్గించటం, ప్రభుత్వ సారా దుకాణాలతో ప్రజలని సురాపానంలో ముచ్చెత్తటం వంటి గొప్ప పనులు చేసిన మండలాధీశుడు ఎన్‌టీరామారావ్ పుణ్యామా అని ఆయన రోజుల నించీ మొన్నటిదాకా లైబ్రరీలు పుస్తకాలు కొనటం మానేశాయిష. పుస్తకాలెందుకు సినిమాలు చూడక అని కావును ఆయన ఉద్దేశ్యం. ఆయనే పోయాక ఆయన చేసిన తప్పుడు పనులు మనకెందుకు అని, ఇప్పుడు మళ్ళీ పుస్తకాలు కొనమని బళ్ళని ఓడలు చేశారని ఎవరో చెప్పారు. అది నిజమైతే సంతోషించాల్సిన విషయమే. నిజం కాకపోతే రూఢీగా నాకు తెలీదు కనుక నన్నొగ్గేయండి.

అలాగే రచయితల్లో డబ్బు కాపీనం వుందో లేదో నాకు తెలీదు కానీ, నాకీ రచయతల్లో నచ్చింది- ఎవరు ప్రచురిస్తారా అసలు పారితోషకం ఇస్తారా లేదా అని ఆలోచించి వాళ్ళు వ్రాయటం లేదు. (ఇక్కడ కూడా సరసమైన కథలూ, బూతు రచనలూ రాసి రంపాన పెట్టే వాళ్ళ గురించి వ్రాయటంలేదు) వాళ్ళ స్పందనా, రచనా చాతుర్యంతో తాము వ్రాయదలుచుకున్నది వ్రాస్తున్నారు. అవి కొంతమందికి నచ్చవచ్చు, కొంతమందికి నచ్చకపోవచ్చు. వాళ్ళేమీ లక్షలు ఆశించటంలేదు. ఎవరైనా చదివి, అది నచ్చితే నచ్చిందని ఓ చిన్న మాట వ్రాస్తే వాళ్ళకి అదే పది వేలు. అదే వారి ఉత్సాహానికి ఊపిరి. అదే వారి రచనా పటిమకి జ్ఞానపీఠం.

పుస్తకాలకి నిజంగా విలువెంత? అనేది ఒక ప్రశ్న. ఇది పుస్తకాలకే కాదు కళా సంబంధమైన దేదైనా అంతే. చక్కటి పైంటింగ్ కానీ, గొప్ప నవలో ప్రభంధ కావ్యమో కానీ, మంచి సంగీతం కార్యక్రమం లేదా సీడీలకి ఇంత అని విలువ వుండదు. పేజీకి ఇన్ని పైసల చొప్పున లేదా కిలోగ్రాముకి ఇన్ని వందల రూపాయలు అని కానీ వాటి వెల నిర్ధారించటమూ కుదరదు. అయితే వీటిలో కొన్ని రెండు రకాలుగా అమూల్యం. ఒకటి నిజంగా విలువ కట్టలేనివి. రెండు విలువ లేనివి. ఏవి ఎలాటివో మళ్ళీ మనుష్యుల అభిరుచులని బట్టీ, అవి కొంటున్నప్పుడు వున్న కాలపరిస్థితులని బట్టీ వుంటుందని మనకి తెలుసు. అమెరికన్లు కొందరు చక్కటి

పైంటింగుల కోసం కొన్ని వేల డాలర్లు పెట్టటం చూశాను.

'అవునండీ వాళ్ళు ధనవంతులు. ప్రపంచంలో జనం తిండి లేక చస్తుంటే వీళ్ళు పైంటింగులకోసం పెద్ద మొత్తాలు తగలేస్తున్నారు' అంటాడు సూర్యనారాయణ.

'నాకు తెలిసిన వాళ్ళు అంత డబ్బులున్నవాళ్ళేమీ కాదు. వాళ్ళకా పైంటింగులంటే ప్రాణం. తిండయినా తగ్గించుకుంటారు కానీ వాటిని మాత్రం వాళ్ళ లివింగ్ రూముల్లో పెట్టుకోవాల్సిందే అందుకే ఆఫీసుల్లో ఓవర్ టైములు చేస్తూ, వాళ్ళు క్రెడిట్ కార్డు అప్పుల మీద కొంటున్నవే అవి' అంటాడు ఆదినారాయణ.

ఆరుద్రగారి ఆంధ్ర సమగ్ర సాహిత్యం పదమూడు సంపుటాల కోసం 1990లలో ఇండియాకి వెళ్ళిన రెండు మూడు సార్లూ నేను తిరగని షాపు లేదు. గుంటూరులోనూ విజయవాడలోనూ హైదరాబాద్‌లోనూ అన్ని షాపులూ తిరిగాను. రచయితగా నేనెవరో వారికి తెలుసు కనుక, నా మీద సానుభూతి కూడా చూపించి 'అలాటివి ఎవరూ కొనటంలేదండీ. అందుకే మళ్ళీ మళ్ళీ వేయటం లేదు. రామలక్ష్మిగారి దగ్గర కూడా కాపీలు లేవన్నారు.' అన్నారు. వాటికోసం ఎంతో డబ్బూ, కాలం, శ్రమా ఖర్చు పెట్టి చివరికి ఆశలు వదులుకున్నాను. తర్వాత నాలుగేళ్ళకి నా అదృష్టం బాగుండి మిత్రులు శోభగారి నాన్నగారు నారాయణరావుగారు నా బాధ చూడలేక, మొత్తానికి ఎలాగోలా అవి సంపాదించి, పోయిన సంవత్సరం నాకు బహుమతిగా పంపించారు. ఏ రకంగా చూసినా అది నాకు ఎంతో అమూల్యమైన బహుమతి అది.

ఇంతకు ముందు మనం ఈకబుర్లలో అనుకున్నట్టు నిజాలకన్నా ఇజాలకి ప్రాముఖ్యం ఇచ్చే ఈ రోజుల్లో, అందరికీ అన్ని రకాల పుస్తకాలూ నచ్చకపోవచ్చు. కానీ ఏరకమైన పుస్తకమైనా అమ్ముడుపోయేంత మంది జనాభా వున్న దేశం మనది. అక్కడే నాకు ఆశ్చర్యం వేస్తుంది. పదికోట్ల జనాభా వున్న తెలుగు దేశంలో, వెయ్యి పుస్తకాలకి అమ్మకాలు లేవంటే వింతల్లో వింత అని నా ఉద్దేశ్యం.

బ్లాకులో రెండు మూడు రెట్లు ఖర్చు పెట్టి సినిమా టిక్కెట్టు కొనే మనిషి, చక్కటి పుస్తకాన్ని కొనని పరిస్థితి!

మన సంస్కృతిలో అది ఒక భాగం అయిపోయింది మరి.

అప్పుడప్పుడూ నాకనిపిస్తుంది. పుస్తకాలు కొని చదివే కొద్దిమందీ ఎలాగూ చదువుతారు. మిగతావారికి పుస్తక పఠనం అలవాటు చేయటం కోసం, కొన్ని పుస్తకాలు ఉచితంగా బహుమతి ఇస్తే ఎలా వుంటుంది అని.

ఆదినారాయణ అంటాడు 'అది ఉచితంగా ఇచ్చినా అనుచితం అంటాను. ఎందుకంటే వూరికే ఇచ్చావు కదా అని వాళ్ళు చదవరు. అలవాటు లేని ప్రాణాలని ఎందుకు ఇబ్బంది పెట్టటం. అదొక్కటే కాదు, పుస్తకాలని అలా వృథా చేయటం వల్ల, అవసరమైన వారికి అందుబాటులో లేని పరిస్థితి కల్పించటమవుతుంది' అని.

ఏమో. నాకే అనుమానం వస్తున్నది 'ఓ తెలుగు పుస్తకమా నీ విలువెంత' అని.

0 0 0